సాక్షి
హనుమకొండ
ఆదివారం । 22 । జూన్ । 2025

ఢిల్లీని తాకిన ఓరుగల్లు వివాదం



- చర్చనీయాంశంగా మంత్రి కొండా సురేఖ వర్సెస్ ఎమ్మెల్యేల అంశం
- పరస్పర ఆరోపణలపై సీరియస్‌గా స్పందించిన టీపీసీసీ
- ద్విసభ్య కమిటీ వేసేందుకు సుముఖం.. అధికారికంగా లేని ప్రకటన
- హైదరాబాద్‌కు నేడు పార్టీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్
- రాజధానికి తరలనున్న ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ముఖ్యులు
- కొండా సురేఖపై ఫిర్యాదు చేయనున్న పలువురు ప్రజాప్రతినిధులు
- రసవత్తరంగా మారిన ఓరుగల్లు కాంగ్రెస్ రాజకీయం

- 8లో ▸

న్యూస్‌రీల్

డిపో ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి



హన్మకొండ: డిపో ఆర్థికాభివృద్ధికి ఉద్యోగులు పాటుపడాలని ఆర్టీసీ వరంగల్-1 డీఎం పుప్పాల అర్పిత అన్నారు. శనివారం హనుమకొండలోని వరంగల్-1 డిపోలో ఉద్యోగుల ప్రగతి చక్రం పురస్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ అర్పిత మాట్లాడుతూ.. ఆదాయంలో డిపోను అగ్రభాగాన నిలపాలన్నారు. ఉద్యోగులంతా కష్టపడి పని చేయాలని చెప్పారు. అనంతరం విధుల్లో ప్రతిభ కనబర్చిన కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లు, గ్యారేజీ సిబ్బందికి ప్రగతి చక్ర అవార్డులు అందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సంతోశ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

జయశంకర్ స్మృతి వనంలో గ్రంథాలయం నిర్మించాలి



హన్మకొండ: జయశంకర్ స్మృతి వనంలో గ్రంథాలయం నిర్మించాలి.. లేదంటే ఈ స్థలం ఆక్రమణకు గురయ్యే అవకాశముందని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ అన్నారు. తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం హనుమకొండ బాలసముద్రంలోని జయశంకర్ స్మృతి వనంలో బండా ప్రకాశ్‌తో పాటు బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయి నివాళులర్పించారు. ఈసందర్భంగా పార్కులోని సమస్యలను వాకర్స్ వారికి వివరించారు. స్మృతి వనం ఉత్తరం వైపు స్థలంలో గ్రంథాలయం నిర్మించడానికి గతంలో హామీ ఇచ్చారని, ఈమేరకు చర్యలు చేపట్టాల్సిన అవసరముందని బండా ప్రకాశ్ అన్నారు. అలాగే పార్కులో పొడవైన చెట్లతో గ్రీనరీ బాగుందని, ఆహ్లాదాన్ని పంచేలా పూల మొక్కలు నాటాలని కమిషనర్‌కు సూచించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

24న వాహనాల వేలం

ఎంజీఎం: హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశాల మేరకు 24వ తేదీ మంగళవారం ఉదయం 11.30 గంటలకు గౌతమినగర్ డాక్టర్స్ కాలనీలో 104 సంచార వాహనాలు వేలం వేయనున్నట్లు డీఎంహెచ్‌ఓ అప్పయ్య తెలిపారు. ఒక్కో వాహనానికి రూ.1.30 లక్షలు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ.20 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

రైతుల ఖాతాల్లో రూ.143.65 కోట్లు జమ

హన్మకొండ: రైతు భరోసా పథకం కింద హనుమకొండ జిల్లాకు చెందిన రైతులకు ప్రభుత్వం శనివారం రూ.143.65 కోట్లు జమ చేసింది. జిల్లాలోని 14 మండలాలు 163 గ్రామాలకు చెందిన 1,40,522 మంది రైతుల ఖాతాల్లో రూ.143.65 కోట్ల పెట్టుబడి సహాయాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందని జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్ తెలిపారు.

ప్రైవేట్ హాస్టల్‌లో ర్యాగింగ్ కలకలం

వరంగల్ చౌరస్తా: వరంగల్ అనంతలక్ష్మి ఆయుర్వేద కళాశాలకు చెందిన విద్యార్థినిపై ప్రైవేట్ హాస్టల్‌లో ఏడుగురు విద్యార్థినులు ర్యాగింగ్‌కు పాల్పడ్డారు. పలుమార్లు జరిగిన ర్యాగింగ్‌తో భరించలేకపోయిన ఆ విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం అందించింది. దీంతో వారు కళాశాల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వారం రోజుల్లో విచారణ చేసి వేధింపులకు పాల్పడిన విద్యార్థినులపై చర్య తీసుకుంటామని అధికా రులు హామీ ఇచ్చారు.

ఎడ్‌సెట్‌లో నాగరాజుకు మూడో ర్యాంకు

విద్యారణ్యపురి: రాష్ట్రంలో బీఈడీ కోర్సులో ప్రవేశానికి నిర్వహించిన టీజీ ఎడ్‌సెట్ ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఇందులో హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం లింగమడుగుపల్లికి చెందిన కొడగాని నాగరాజు మూడో ర్యాంకు సాధించినట్లు ఎడ్‌సెట్ కన్వీనర్, కేయూ ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ బి.వెంకట్రామ్‌రెడ్డి తెలిపారు. 150 మార్కులకు నాగరాజు 121.31445 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు.

అడవుల్ని చుట్టొద్దాం..

సండే స్పెషల్

తాడ్వాయి, ఏటూరునాగారం అభయారణ్యంలో త్వరలో 'జంగిల్ సఫారీ'

అడవుల్లో 17కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం



మేడారం-తాడ్వాయి మధ్యలో ఇటీవల కనిపించిన అడవి దున్న (ఫైల్)



జంగిల్ సఫారీ కోసం అడవిలో వేసిన రోడ్డు





ఏటూరునాగారం అభయారణ్యంలోని కొండేటివాగు

బోన్ల నడుమ జంతువుల్ని.. డెన్ మధ్యన పులిని.. గూళ్లలో పిచ్చుకల్ని.. నిలువ నీటి తొట్లలో తాంబేళ్లను.. ఆక్వేరియంలో చేపల్ని జూ పార్క్‌లో చూసి మురిసిపోతాం. అలాంటిది.. దట్టమైన అడవిలో పచ్చందాల నడుమ సఫారీలో ప్రయాణిస్తూ.. వేటాడే పులిని.. చెవులకింపైన పక్షుల కిలకిలారావాల్ని.. చెంగుచెంగున పరుగెట్టే లేడికూనల్ని చూస్తూ సెల్‌ఫోన్లలో బంధిస్తూ పర్యాటకులు మైమరచిపోయేలా.. ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యాటకానికి మరింత శోభ తెచ్చేలా ఎస్ఎస్ తాడ్వాయి వైల్డ్‌లైఫ్ అటవీశాఖ ఏర్పాట్లు చేస్తోంది. తాడ్వాయి, ఏటూరునాగారం అభయారణ్యంలో హాయిగా విహరించేందుకు సాగుతున్న 'జంగిల్ సఫారీ' ఏర్పాట్లపై ఈవారం 'సాక్షి' ప్రత్యేకం. -ఎస్ఎస్‌తాడ్వాయి

- ఏర్పాట్లు చేస్తున్న అటవీశాఖ అధికారులు
- ఉమ్మడి జిల్లా పర్యాటకానికి మరింత శోభ

ములుగు జిల్లాలోని ఏటూరునాగారం, తాడ్వాయి అభయారణ్యాన్ని పర్యాటకులు చుట్టి వచ్చేందుకు అటవీశాఖ అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్ఎస్ తాడ్వాయి వైల్డ్ లైఫ్ శాఖ ఆధ్వర్యంలో జంగిల్ సఫారీకి సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి. పర్యాటకులు సఫారీలో అడవులను వీక్షించేందుకు సైతం రోడ్ల నిర్మాణ పనులు చేస్తున్నారు. త్వరలోనే జంగిల్ సఫారీ పర్యాటకులకు అందుబాటులోకి రానుంది.

17 కిలోమీటర్లు దారి..

అడవులను జంగిల్ సఫారీ ద్వారా సందర్శించేందుకు ఎస్ఎస్‌తాడ్వాయి హట్స్ సమీపం నుంచి కాటాపూర్ బీటీ రోడ్డు నుంచి అడవిలో 17 కిలోమీటర్ల వరకు దారి ఏర్పాటు చేశారు. దారి మధ్యలో సిమెంట్ కాజ్‌వేలు కూడా నిర్మించారు. అడవిలో పెద్దగుట్ట వరకు దారి ఏర్పాటు చేశారు. ఈదారి మార్గాన జంగిల్ సఫారీలో పర్యాటకులు పెద్దగుట్ట చుట్టి వచ్చేలా ఏర్పాట్లు సాగుతున్నాయి.

ప్రకృతిని ఆస్వాదించేలా..

హైదరాబాద్ పట్టణ ప్రాంతాల నుంచి బొగత, లక్నవరం, రామప్ప పర్యాటక ప్రాంతాల సందర్శనకు వచ్చే పర్యాటకులు దట్టమైన అడవుల్లోని ప్రకృతికి ఫిదా అవుతారు. గతంలో ఎస్ఎస్ తాడ్వాయి హట్స్‌లో బస చేసిన పర్యాటకులు ట్రెక్కింగ్, జంగిల్ సఫారీ ద్వారా అడవులను చుట్టుముట్టి వచ్చేవారు. సుమారు ఐదేళ్ల క్రితం జంగిల్ సఫారీ మూలనపడింది. దీంతో అప్పటినుంచి పర్యాటకులు ఎస్ఎస్ తాడ్వాయిలోని అడవుల సందర్శన నిలిచిపోయింది.

పెరుగుతున్న పర్యాటకుల తాకిడి

రోజురోజుకూ పలు ప్రాంతాల నుంచి పర్యాటక ప్రదేశాలను సందర్శించేందుకు పర్యాటకుల తాకిడి పెరుగుతుండడంతో అటవీశాఖ అధికారులు మళ్లీ జంగిల్ సఫారీని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అడవి మార్గాల్లో రోడ్లను ఏర్పాటు చేస్తున్నారు. రోడ్ల నిర్మాణ పనులు కూడా పూర్తి దశకు చేరుకున్నాయి. త్వరలోనే జంగిల్ సఫారీ వాహనాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. తాడ్వాయి మండల పరిధిలోని దామెరవాయి అటవీ ప్రాంతంలోని ఆదిమానవుల సమాధులను పర్యాటకులు, యూనివర్సిటీ విద్యార్థులు సందర్శిస్తున్నారు. అడవుల సందర్శనతో పాటు సమాధులను వీక్షించేందుకు జంగిల్ సఫారీ వాహనం ఏర్పాటు చేస్తే బాగుంటుందని స్థానికులు, పర్యాటకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తాడ్వాయి నుంచి మేడారం మీదుగా ఊరట్టం ఏటూరునాగారం మండలంలోని కొండాయి వెళ్లే దారిలో మూడు కిలోమీటర్ల దూరంలో కొండేటి వాగు వ్యూ పాయింట్ చాలా అద్భుతంగా ఉంది. ఈ పాయింట్ వరకు జంగిల్ సఫారీ ఏర్పాటు చేస్తే మేడారానికి వచ్చే భక్తులతో పర్యాటకుల సంఖ్య పెరగనుంది.

రెండు నెలల్లో అందుబాటులోకి..



ఎస్ఎస్‌తాడ్వాయిలోని జంగిల్ సఫారీ 60 రోజుల్లో పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొస్తాం. తాడ్వాయి హట్స్ నుంచి 17 కిలోమీటర్లు పెద్దగుట్ట వరకు రోడ్డు నిర్మాణం పూర్తయింది. ఇంకా అన్ని హంగులతో అడవులను సందర్శించేలా ఏర్పాట్లు సాగుతున్నాయి.

- రమేశ్, ఎఫ్‌డీఓ, ఏటూరునాగారం







ఆరోగ్య యోగం.. ఆసనాలతో సాధ్యం

- మరిన్ని చిత్రాలు 9లో

హనుమకొండ, వరంగల్ నగరంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఖిలావరంగల్ మధ్య కోటలోని నాలుగు కీర్తి తోరణాల నడుమ వేడుకల్ని వరంగల్ కలెక్టర్ సత్యశారద, పద్మశ్రీ అవార్డు గ్రహీత సోమ్లానాయక్ ప్రారంభించారు. రుద్రేశ్వరాలయంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ వేడుకల్ని ప్రారంభించారు. ఈసందర్భంగా యోగా సాధకులు ఆసనాలు వేశారు. అవగాహన కల్పించారు. - సాక్షి నెట్‌వర్క్

పథకాలు పటిష్టంగా అమలు చేయాలి

- జిల్లాను అగ్రభాగంలో నిలపాలి
- 'దిశ' సమావేశంలో ఎంపీ కడియం కావ్య



సమావేశంలో ఎంపీ కావ్య, పక్కన మండలి డిప్యూటీ చైర్మన్, కలెక్టర్, కమిషనర్

హన్మకొండ అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అమలుకు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని దిశ కమిటీ చైర్‌పర్సన్, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు రైతులకు అందేలా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని, క్యాన్సర్ స్క్రీనింగ్, పీఎంఆర్ఎఫ్ ప్రయోజనాల అమలుపై దృష్టి సారించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. 'బేటీ బచావో బేటీ పడావో'పై మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని, బాల్యవివాహాలు నివారించేలా గ్రామాల్ని తీర్చిదిద్దాలని మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులకు సూచించారు. ఐసీడీఎస్ ద్వారా బరువు తక్కువగా ఉన్న పిల్లలకు పోషకాహారం అందించాలన్నారు. దిశ కమిటీ సమావేశానికి సంబంధించి వచ్చే విడతలో రైల్వే, దేవాదాయ, పర్యాటక, యూనివర్సిటీ అధికారులు కూడా పాల్గొనాలని ఎంపీ సూచించారు. అన్ని శాఖలు తమ తమ పథకాల అమలు వివరాలతో హాజరుకావాలన్నారు. అనంతరం స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని, పల్లె, బస్తీ దవాఖానల నిర్మాణంలో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయం చూడాలన్నారు. శాసన మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ, వైద్యారోగ్యశాఖ సమన్వయంతో మంచి ఫలితాలు సాధించాలని, ఆశ వర్కర్ల ఖాళీల భర్తీకి జిల్లా స్థాయిలో చర్యలు తీసుకోవాలన్నారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. గ్రేటర్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ గ్రేటర్ అభివృద్ధి వివరాలు వెల్లడించారు. కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో ఉండాలన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కమిటీ సభ్యులు బండ రామలీల, డీఆర్డీఓ పీడీ శ్రీను, డీఎంహెచ్‌ఓ అప్పయ్య ఇతర శాఖల అధిపతులు పాల్గొన్నారు.

వాగ్దానాలు నెరవేర్చాలి..

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



మాట్లాడుతున్న జాన్ వెస్లీ

ఖిలా వరంగల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలి.. నిరుపేదలకు డబుల్‌బెడ్రూం ఇళ్లు కట్టించి ఇవ్వకుంటే సర్కారు మెడలు వంచుతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. శనివారం వరంగల్ ఉర్సుగుట్ట వద్ద పార్టీ జిల్లా కార్యాలయంలో కార్యదర్శి సీహెచ్.రంగయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ఇరాన్-ఇజ్రాయిల్ యుద్ధంపై మాట్లాడుతూ.. అమెరికా అండతో ఇజ్రాయిల్ పాలస్తీనాను దురాక్రమణ చేయడానికి ప్రయత్నిస్తున్నదని అన్నారు. ఈ చర్యను తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదని చెప్పారు. సమావేశంలో నాయకులు జి.నాగయ్య, బాబు, రత్నమాల, ఈసంపెల్లి బాబు, భూక్య సమ్మయ్య, కుమారస్వామి, సాంబయ్య, శ్రీధర్, మధుకర్, ప్రశాంత్, వలదాసు దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

డయేరియా మరణాలను అరికట్టాలి

వరంగల్ కలెక్టర్ సత్యశారద



సమీక్షిస్తున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద

న్యూశాయంపేట: డయేరియా మరణాలను అరికట్టాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో స్టాప్ డయేరియా క్యాంపెయిన్ ఫోర్స్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డయేరియా నివారణకు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. వర్షాకాలంలో తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున గ్రామాల్లో క్లోరినేషన్ చేయాలని, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు ప్రకాశ్, కొంరయ్య, ప్రోగ్రాం అధికారులు ఆచార్య, అర్చన, విజయ్‌కుమార్, ఎంహెచ్‌ఓ రాజేశ్, వర్ధన్నపేట మున్సిపల్ కమిషనర్ సుధీర్, డీడబ్ల్యూఓ రాజమణి, సుజన్‌తేజ, భవాని, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పించాలి

ముందస్తుగా వరి నార్లు పోసుకునేందుకు రైతులకు అధికారులు అవగాహన కల్పించాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, వ్యవసాయ శాఖ అనుబంధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వరి, పత్తి కొనుగోళ్లలో ఈ టోకెన్ సిస్టం అమలుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని, పత్తి, మిరప పంటల దిగుబడి, మార్కెటింగ్‌లో నాణ్యత పెంచేందుకు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్ తనిఖీ

వరంగల్ అర్బన్: హనుమకొండ బాలసముద్రంలోని క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్‌ను గ్రేటర్ వరంగల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం 31వ డివిజన్ గాయత్రి కాలనీలో నిర్మిస్తున్న రోడ్లను పరిశీలించారు. వరంగల్ కాశిబుగ్గ సర్కిల్‌ను తనిఖీ చేశారు. ఆయా విభాగాల ఫైళ్లను పరిశీలించి, ఉద్యోగులు, అధికారుల పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ ఫైళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

ఉద్రిక్తత.. ఉత్కంఠ

ఉదయం నుంచి రాత్రివరకు సాగిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఎపిసోడ్





ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని వైద్యపరీక్షల నిమిత్తం సుబేదారి పోలీస్‌స్టేషన్ నుంచి ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో) పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళనకారులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

- శంషాబాద్‌లో అరెస్ట్ చేసి హనుమకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు..
- బీఆర్ఎస్, విద్యార్థి నేతల ఆందోళన.. సీఎం దిష్టిబొమ్మ దహనం
- బెయిల్ రావడంతో కార్యకర్తల ఆనందోత్సాహం

హనుమకొండలో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఉద్రిక్తత, ఉత్కంఠ వాతావరణం నెలకొంది. గ్రానైట్ వ్యాపారిని బెదిరించిన కేసులో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని హనుమకొండ సుబేదారి పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి తరువాత శంషాబాద్ ఎయిర్ పోర్టులో అరెస్ట్ చేసి నేరుగా వరంగల్‌కు తీసుకొచ్చారు. మాజీ ప్రజాప్రతినిధులు, విద్యార్థి నాయకుల ఆందోళన, పరామర్శలతో సుబేదారి పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. రాత్రి ఆయనకు బెయిల్‌రావడంతో కార్యకర్తలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. - 8లో ▸ - వరంగల్ క్రైం/కాజీపేట రూరల్

దోచుకుతిన్న ప్రతీరూపాయి కక్కిస్తాం..

- 8లో ▸

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ● బెదిరింపు రాజకీయాలు ఇక సాగవు : ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

యశోద హాస్పిటల్స్
యశోద మెడికల్ సెంటర్
1వ అంతస్థు, జై గోవింద్ కాంప్లెక్స్, ఎస్‌బిఐ పక్కన, నక్కలగుట్ట, హన్మకొండ
సూపర్ స్పెషాలిటీ వైద్యనిపుణులు మీ చేరువలో

ప్రత్యేకతలు	వైద్యులు	తేది - సమయం
న్యూరాలజీ కన్సల్టేషన్: పక్షవాతము, ఎపిలెప్సీ (మూర్ఛ), తలనొప్పి, మైగ్రేన్, మెడ / వెన్ను నొప్పి, మతిమరుపు, పార్కిన్ సన్స్, నరాల బలహీనతలు, వణుకు/ నడక ఇబ్బంది, మెదడుకు సంబంధించిన ఇతర జబ్బులు	[illegible]	24-06-2025 4వ మంగళవారం
ఆర్థోపెడిక్ / కీళ్ళమార్పిడి కన్సల్టేషన్: మోకాళ్ళు, తుంటి, మోచేయి, కీళ్ళ మార్పిడి, మరియు ఎముకల సంబంధిత వ్యాధులు	[illegible]	
క్యాన్సర్ వ్యాధులకు కన్సల్టేషన్: మహిళ పుండ్లు, రొమ్ములో గడ్డలు, గర్భసంచి క్యాన్సర్, థైరాయిడ్ క్యాన్సర్, జీర్ణకోశ క్యాన్సర్, రెక్టమ్ క్యాన్సర్, నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్ మరియు పోస్టేట్ క్యాన్సర్	డా॥ హేమంత్	25-06-2025 4వ బుధవారం
ఆర్థోపెడిక్ / కీళ్ళమార్పిడి కన్సల్టేషన్: మోకాళ్ళు, తుంటి, మోచేయి, కీళ్ళ మార్పిడి, మరియు ఎముకల సంబంధిత వ్యాధులు	డా॥	26-06-2025 4వ గురువారం
కిడ్నీ వ్యాధులకు కన్సల్టేషన్: కిడ్నీ మార్పిడి అవసరం ఉన్న వాళ్ళు, డయాబెటిస్ వల్ల వచ్చే కిడ్నీ వ్యాధులు, అధిక రక్తపోటు	డా॥	27-06-2025 4వ శుక్రవారం
ఊపిరితిత్తుల వ్యాధులకు కన్సల్టేషన్: దీర్ఘకాలిక దగ్గు, శ్వాసలో గురక, ఆస్తమా, అలర్జీ మరియు సిఓపిడి	డా॥ సాయి రెడ్డి	
క్యాన్సర్ వ్యాధులకు కన్సల్టేషన్: మహిళ పుండ్లు, రొమ్ములో గడ్డలు, గర్భసంచి క్యాన్సర్, థైరాయిడ్ క్యాన్సర్, జీర్ణకోశ క్యాన్సర్, రెక్టమ్ క్యాన్సర్, నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్ మరియు పోస్టేట్ క్యాన్సర్	డా॥	28-06-2025 4వ శనివారం

అపాయింట్‌మెంట్ కొరకు: 0870 - 2427777 | 2447778 | 2447779 | 707 570 4542

ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల నమోదు పెరగాలి

● కలెక్టర్ స్నేహ శబరీష్

హన్మకొండ అర్బన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెంచడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, వివిధ సంక్షేమ గురుకుల కళాశాలల్లో విద్యార్థుల నమోదు, రవాణా సదుపాయం, గురుకుల కళాశాలల్లో వసతుల కల్పనపై సంబంధిత శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో కాలేజీలు, గురుకులాల్లో విద్యార్థుల సంఖ్య, సదుపాయాలు తదితర అంశాలపై అధికారులు సమగ్ర సమాచారం ఇవ్వాలని చెప్పారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోపాల్, ఎస్సీ, ట్రైబల్, బీసీ వెల్ఫేర్ డీడీలు నిర్మల, ప్రేమకళ, లక్ష్మణ్, ఆర్టీసీ ఆర్‌ఎం ధరమ్‌సింగ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

విహారయాత్రకు ఆర్టీసీ టూర్ ప్యాకేజీ

హనుమకొండ జిల్లా కేంద్రం నుంచి వివిధ ప్రాంతాల విహార యాత్రకు వెళ్లేందుకు ఈనెల 27న ప్రత్యేక టూర్ ప్యాకేజీ కింద సూపర్ లగ్జరీ, డిలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ స్నేహ షబరీష్ తెలిపారు. పూర్తి సమాచారానికి 8977781103, 9493882464, 9573090136 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఇందుకు సంబంధించిన ధరలు, రూట్ల వివరాలతో కూడిన ప్రచార పోస్టర్‌ను శనివారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో హనుమకొండ డిపో మేనేజర్ బి.ధరమ్‌సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

24న డీసీసీబీ మహాజన సభ

హన్మకొండ : వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) మహాజన సభ ఈనెల 24న నిర్వహించనున్నట్లు ఆ బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణాధికారి మహ్మద్ వజీర్ సుల్తాన్ తెలిపారు. హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఉదయం 11గంటలకు మహాజన సభ జరుగుతుందని ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

స్కూటీ @ 233 చలాన్లు



వరంగల్ క్రైం: ఓ స్కూటీ(ఆక్టివా)పై ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా 233 చలాన్లు ఉన్నాయి. సదరు వాహన యజమానిని హనుమకొండ జిల్లా కాజీపేట ట్రాఫిక్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న కాజీపేట చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో హనుమకొండకు చెందిన అస్లాం స్కూటీకి సంబంధించిన వివరాలను పరిశీలించి ఒక్కసారిగా ఖంగుతిన్నారు. అతడి బండి నంబర్‌పై ఏకంగా 233 పెండింగ్ చలాన్ల రూపంలో రూ.45,350 జరిమానా ఉండడంతో ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపారు. జరిమానా మొత్తం చెల్లించి వాహనం తీసుకెళ్లాలని సూచించారు.



వినయ్‌భాస్కర్‌ను అడ్డుకుంటున్న పోలీసులు



పోలీస్ స్టేషన్ వద్ద ఎర్రబెల్లి దయాకర్‌రావు, కౌశిక్‌రెడ్డి భార్య



సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి నేతలు



ఉద్రిక్తత..ఉత్కంఠ

● ఉదయం నుంచి రాత్రివరకు సాగిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఎపిసోడ్
● శంషాబాద్‌లో అరెస్టు చేసి హనుమకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు..
● బీఆర్‌ఎస్ నేతల ఆందోళన.. రోడ్డుపై బైఠాయింపు
● సీఎం దిష్టిబొమ్మ దహనం.. విద్యార్థి నేతల అరెస్టు

వరంగల్ క్రైం/కాజీపేట రూరల్: హనుమకొండలో శనివారం ఉదయం నుంచి రాత్రివరకు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. గ్రానైట్ వ్యాపారిని బెదిరించిన కేసులో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని హనుమకొండ సుబేదారి పోలీసులు శంషాబాద్ ఎయిర్ పోర్టులో అరెస్ట్ చేసి నేరుగా వరంగల్‌కు తీసుకు వచ్చారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో సుబేదారి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఆందోళన చేశారు. అక్రమ అరెస్టులను నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వం, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులను నిలువరించేందుకు పోలీసులు రోడ్డుకు ఇరువైపులా బారికేడ్లను అడ్డు పెట్టి మోహరించారు.

కేసు నమోదు ఇలా..

కమలాపురం మండలంలోని గుండేడు గ్రామానికి చెందిన గ్రానైట్ వ్యాపారి కట్ట మనోజ్‌రెడ్డిని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఫోన్‌లో బెదిరించి రూ.50లక్షలు డిమాండ్ చేసినట్లు, తన భర్తకు ప్రాణాపాయం ఉన్నట్లు గత ఏప్రిల్ 21న కట్ట ఉమాదేవి సుబేదారి పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేయగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించగా ముందుస్తు అరెస్టులు చేయవద్దని కోర్టు పోలీసులను ఆదేశించింది. ఈ క్రమంలో హైకోర్టు ఆ ఉత్తర్వులను ఇటీవల రద్దు చేయడంతో పోలీసులు పథకం ప్రకారం శుక్రవారం రాత్రి శంషాబాద్ ఎయిర్‌ఫోర్ట్‌లో అరెస్టు చేసి సుబేదారి పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చారు.



బెయిల్ అనంతరం మీడియాతో మాట్లాడుతున్న వినోద్‌కుమార్, ఎర్రబెల్లి దయాకర్ రావు

రోడ్డుపై బీఆర్‌ఎస్ నాయకుల బైఠాయింపు..

పాడి కౌశిక్‌రెడ్డి అరెస్టు విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నేతలు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, శంకర్ నాయక్, నేతలు రాకేష్ రెడ్డి, సత్యనారాయణరావు పలువురు సుబేదారి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. కౌశిక్ రెడ్డిని కలవకుండా అడ్డుకోవడంతో రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. అనంతరం నేతలు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్‌ను కలిసి పరిస్థితిని వివరించారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం..

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీఆర్‌ఎస్ నేతలను అక్రమంగా అరెస్టు చేయిస్తున్నారని ఆరోపిస్తూ బీఆర్‌ఎస్ కార్యకర్తలు, విద్యార్థి నేతలు సుబేదారి పోలీస్ స్టేషన్ సమీపంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసే క్రమంలో పోలీసులు వారిని అడ్డుకున్నారు. అనంతరం విద్యార్థి సంఘం నేతలు బొల్లికొండ వీరేందర్, రామ్మూర్తి, శరత్, రాజేష్ నాయక్, మహమూద్ చోటు, సదంత్, శ్రవణ్ కుమార్, సాయి కుమార్, రాజేష్, రాజ్‌కుమార్‌ను అరెస్టు చేసి కాజీపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కాజీపేట జంక్షన్‌లో 144 సెక్షన్ విధింపు

కాజీపేట రైల్వే కోర్టుకు కౌశిక్‌రెడ్డిని తరలించే నేపథ్యంలో పోలీసులు రైల్వే కోర్టు బయట చుట్టూ పక్కల ఎవరు రాకుండా 144 సెక్షన్ విధించారు. కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్‌రెడ్డి పర్యవేక్షణలో సీఐ సుధాకర్‌రెడ్డి, పోలీసులు బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులను, మీడియాను కోర్టు ప్రాంగణంలోకి రాకుండా కట్టడి చేశారు. మధ్యాహ్నం 3:10 గంటలకు కౌశిక్‌రెడ్డిని పోలీసులు రైల్వే కోర్టుకు తరలించారు. విషయం తెలిసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ కోర్టుకు వచ్చారు. అనంతరం రాత్రి 8 గంటల తర్వాత రిమాండ్‌ను కొట్టివేసి బెయిల్ మంజూరు కావడంతో ఆనందంగా వ్యక్తం చేశారు

రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే అరెస్ట్.. బీఆర్‌ఎస్ సీనియర్ నేత ఏనుగుల రాకేష్ రెడ్డి

హన్మకొండ: రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని అరెస్టు చేశారని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, ఎప్పటికప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతున్నందుకే ఈ అరెస్ట్ అని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చేదాక ఈ ప్రభుత్వాన్ని వెంటాడుతూనే ఉంటామన్నారు.

కౌశిక్‌రెడ్డికి ఎంజీఎంలో వైద్యపరీక్షలు



కౌశిక్ రెడ్డికి వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ఎంజీఎం : గ్రానైట్ వ్యాపారిని బెదిరించిన కేసులో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని అరెస్టు చేసిన పోలీసులు శనివారం వైద్యపరీక్షల నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తీసుకు వచ్చారు. మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి, సుబేదారి పోలీసుల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు మధ్య ఎమ్మెల్యేకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంజీఎం అత్యవసర విభాగానికి బీఆర్‌ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో చేరుకుని సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కౌశిక్‌రెడ్డిని నేరుగా కోర్టుకు తరలించారు.

ప్రజా వ్యతిరేకతపై స్పందిస్తున్నాడని..

సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై స్పందిస్తున్న వ్యక్తి కౌశిక్‌రెడ్డి అని, అతనిపై ఏదో కేసు పెట్టాలని చూస్తుంది. ఎట్టి పరిస్థితిల్లో అయినా కౌశిక్ రెడ్డిని జైల్లో పెట్టాలని ఆరోపిస్తూ కేసు పెట్టడం జరిగింది. జడ్జీ వద్ద న్యాయవాదులు వాదించడం వల్ల మేజిస్ట్రేట్ లోతుగా పరిశీలించి బెయిల్ ఇచ్చారు.

\- బి.వినోద్‌కుమార్, మాజీ ఎంపీ

కౌశిక్‌రెడ్డి అరెస్టు కుట్రపూరితం..

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి కుట్రపూరితంగా బీఆర్ఎస్ నేతలను అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారు. ప్రజల తరపున పోరాడుతున్న కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులను కేసుల పేరుతో వేధిస్తోంది. కాంగ్రెస్ పార్టీ కుట్రలను ప్రజా క్షేత్రంలో ఎండగడుతాం.

\- వినయ్‌భాస్కర్, బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు

సీఎం వైఖరిని ఖండిస్తున్నా..

ముఖ్యమంత్రి, మంత్రుల అక్రమాలను, అవినీతిని కేటీఆర్, హరీష్‌రావు, కౌశిక్‌రెడ్డిలు ప్రశిస్తుంటే వారిపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ పాలన వల్ల రాష్ట్రం దివాలా తీసింది.

\- ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ మంత్రి

ఢిల్లీని తాకిన ఓరుగల్లు వివాదం

● చర్చనీయాంశంగా మంత్రి కొండా సురేఖ వర్సెస్ ఎమ్మెల్యేల అంశం

సాక్షిప్రతినిధి, వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ వర్గపోరు తారస్థాయికి చేరుకుంది. ఇన్నాళ్లు నివురు గప్పిన నిప్పులా ఉన్న కోల్డ్ వార్.. ఇటీవల రాహుల్‌గాంధీ పుట్టిన రోజు సందర్భంగా కొండా మురళి చేసిన వ్యాఖ్యలతో రోడ్డెక్కింది. మంత్రి కొండా సురేఖతో ఎమ్మెల్యేలకు కొనసాగుతున్న పొలిటికల్ గ్యాప్‌ను మాజీ ఎమ్మెల్సీ మురళీధర్ రావు వ్యాఖ్యలు బహిర్గతం చేశాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆయా నియోజకవర్గాల నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న 11 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల మధ్య కొద్దిరోజులుగా చాటుమాటుగా సాగుతున్న రాజకీయ కుట్రలు.. ఇప్పుడు ప్రత్యక్షంగా విమర్శలు చేసుకునే స్థాయికి చేరుకున్నాయి. కోల్డ్ వార్ ముదిరి పాకాన పడుతుండడంతో నేరుగానే విమర్శలు, వ్యంగ్యాస్త్రాలకు దిగుతుండడం గమనార్హం. గురువారం కొండా మురళి వ్యాఖ్యల నేపథ్యంలో శుక్రవారం నాయిని రాజేందర్ రెడ్డి ఇంట్లో పలువురు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు సమావేశమై కొండా సురేఖ దంపతులపై మీడియాకెక్కారు. ఇదే సమయంలో కొండా సురేఖ సైతం కడియం శ్రీహరి, రాజేందర్‌రెడ్డిపై వ్యాఖ్యలు చేశారు. ఈనేపథ్యంలో ఓరుగల్లు కాంగ్రెస్ రాజకీయాల ప్రకంపనలు ఢిల్లీని తాకాయి. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఆదివారం హైదరాబాద్‌కు రానుండగా.. ఆమెను కలిసేందుకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులు హైదరాబాద్‌కు వెళ్లనున్నట్లు ప్రకటించారు.

హాట్ కామెంట్స్‌తో ప్రకంపనలు

కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్సీ, మంత్రి కొండా సురేఖ భర్త మురళీధర్‌రావు సొంత పార్టీ నేతలపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. సురేఖ మంత్రి పదవి పోతోందని కొంత మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రచారం చేస్తున్నారంటూ పరోక్షంగా కడియం, రేవూరిప్రకాశ్ రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. 'టీడీపీలో ఉండి చంద్రబాబును ముంచేశాడు. బీఆర్‌ఎస్‌లో కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచి ప్రస్తుతం కాంగ్రెస్‌లో చేరాడు. అధికారంలో ఉన్నప్పుడు ఆయన ఎన్‌కౌంటర్ల స్పెషలిస్ట్. పరకాలలో 75 ఏళ్ల వృద్ధుడు, దరిద్రుడు ఎమ్మెల్యేగా గెలిచాడు. తనను గెలిపించాలని ఆ ముసలోడు నన్ను ఇంటికి వచ్చి కాళ్లు పట్టుకున్నాడు' అని కడియం, రేవూరిపై తీవ్రమైన కామెంట్లు చేయడం ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాలు ఒక కుదుపునకు లోనయ్యాయి. శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అధికార నివాసంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ భేటీ కావడం.. ఆతర్వాత ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కొండా సురేఖ దంపతులతో అమీతుమీకి సిద్ధమైనట్లు ప్రకటించడం సంచలనంగా మారింది. దీంతో కొంతకాలంగా మంత్రి కొండా సురేఖ, కొందరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల మధ్యన నివురుగప్పిన నిప్పులా ఉన్న అంతర్గత కలహాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. మూడు రోజులుగా ఆరోపణలు, ప్రత్యారోపణలు బహిరంగంగా చేసుకుంటున్న పరిస్థితి పార్టీ అధిష్టానానికి తలనొప్పిగా మారాయి. ఈనేపథ్యంలో ఏఐసీసీ, టీపీసీసీ నేతలు రంగంలోకి దిగి ఓరుగల్లు వివాదంపై ద్విసభ్య కమిటీ వేస్తామని హామీ ఇచ్చినా.. అధికారికంగా ఇంకా ప్రకటన చేయలేదు.

మీనాక్షి నటరాజన్ సమక్షంలోనే నేడు అమీతుమీ

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన కొండా దంపతుల వ్యతిరేక ఎమ్మెల్యేల భేటీ, తర్వాత జరిగిన పరిణామాలు కూడా మరింత వేగంగా మారుతున్నాయి. వరంగల్ కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల వ్యవహారంపై ఓ వైపు ఇంటిలిజెన్స్ నివేదికలు, మరోవైపు పార్టీ వర్గాల నుంచి టీపీసీసీ, ఏఐసీసీ పెద్దలు, సీఎం రేవంత్‌రెడ్డి సమాచారం తెప్పించుకున్నట్లు ప్రచారం. కాగా, నేడు హైదరాబాద్‌కు వస్తున్న ఏఐసీసీ నేత, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ కలిసేందుకు సిద్ధమయ్యారు. నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతో పాటు 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, మాజీ మేయర్, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మరికొందరు ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు అమీ తుమీ తేల్చుకునేందుకు రెడీ అయ్యారు. కొందరు శనివారం రాత్రే హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్లగా.. మరికొందరు ఆదివారం ఉదయం వెళ్తున్నట్లు సమాచారం.

డిసెంబర్ నాటికి రైల్వే కోచ్ ఫ్యాక్టరీ..

● రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్
● రైల్వే మోడల్ రన్నింగ్ రూం ప్రారంభం

కాజీపేట రూరల్ : కాజీపేట మండలం అయోధ్యపురం–మడికొండ శివారులో నిర్మిస్తున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఈ ఏడాది చివరి నాటికి పూర్తవుతుందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ పేర్కొన్నారు. శనివారం ప్రత్యేక రైల్లో కాజీపేటకు చేరుకున్న జీఎంకు స్టేషన్ మేనేజర్ రవీందర్ పూలబొకేతో స్వాగతం పలికారు. అనంతరం కాజీపేట జంక్షన్‌లో రూ.7.50 కోట్ల వ్యయంతో నిర్మించిన రైల్వే లోకో పైలెట్లు, ట్రెయిన్ మేనేజర్ల విశ్రాంతి, రైల్వే రన్నింగ్ రూంను జీఎం పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం జీఎం అరుణ్‌కుమార్ జైన్ విలేకరులతో మాట్లాడుతూ.. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ డిసెంబర్ నాటికి పూర్తి కానుందని, అదేవిధంగా రైల్వే అమృత్ భారత్ పనులు కూడా చివరినాటికి పూర్తి చేయనున్నట్లు తెలిపారు. రైల్వే రూట్ రిలే ఇంటర్ లాకింగ్ సిస్టం కార్యాలయంలో తనిఖీ చేశారు. కార్యక్రమంలో రైల్వే డీఆర్‌ఎం భర్తేష్ కుమార్ జైన్, పీసీఓఎం కె.పద్మజా, సీనియర్ డీఎం సురేష్ రెడ్డి, సీనియర్ డీసీఎం శిఫాలి, సీనియర్ డీఎస్టీఈ ప్రీతి అగర్వాల్, డీఈఎన్ సెంట్రల్ ప్రంజల్, ఇతర శాఖల అధికారులు, కాజీపేట డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈ వెంకట కుమార్, ఎలక్ట్రిక్ షెడ్ సీనియర్ డీఈఈ ప్రశాంత్ కృష్ణసాయి, కాదూరి సుబ్బారావు, జొన్నలగడ్డ శేషగిరి రావు, గోపాలం శ్రీనివాస్‌రావు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.



రన్నింగ్ రూంను ప్రారంభిస్తున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్, రైల్వే అధికారులు

వరంగల్‌లో కోచింగ్ లాబీకి నాయకుల వినతి

రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్, డీఆర్‌ఎం భర్తేష్‌కుమార్ జైన్, పీసీఓఎంలను రైల్వే మజ్దూర్ యూనియన్ లోకో రన్నింగ్ బ్రాంచీ సెక్రటరీ పి.సాయికుమార్ ఆధ్వర్యంలో నాయకులు కలిసి వరంగల్‌లో కోచింగ్ సిస్టం లాబీని ప్రారంభించాలని కోరారు. కాజీపేట జంక్షన్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని వినతి పత్రాలు సమర్పించారు. బ్రాంచీ చైర్మన్ సంగ రమేష్, ట్రెజరర్ డి.రఘు, అసిస్టెంట్ చైర్మన్ ఎ.కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ రంగారావు కన్నుమూత

● వచన కవిత్వంలో అగ్రగణ్యుడు మాదిరాజు రంగారావు

కేయూ క్యాంపస్ : ఖమ్మం జిల్లాకు చెందిన కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ మాదిరాజు రంగారావు (90) అనారోగ్య కారణాలతో హైదరాబాద్‌లో శనివారం కన్నుమూశారు. ఆయన భార్య కొంతకాలం క్రితం మరణించగా ఆయనకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తెలుగు సాహిత్యంలో పండితుడు, శాస్త్రీయ సాహిత్యం, భారతీయ, ఆధునిక కవిత్వం, నవల విమర్శ, సంస్కృత సాహిత్య అధ్యయనాలతో సంబంధం కలిగి ఉన్నారు. పదవి విరమణ తర్వాత కూడా వచన కవిత్వంలో 2024 వరకు ప్రతి ఏడాది ఒక పుస్తకం రచించారు కూడా. మాదిరాజు రంగారావు ఆధునిక తెలుగు సాహిత్యంలో అగ్రశ్రేణి సాహిత్య రచయితలలో ఒకరు. కేయూ తెలుగు విభాగంలో 1968 నుంచి 1995వరకు, ఉస్మానియా యూనివర్సిటీలో 1964 నుంచి 1968 వరకు తెలుగు సాహిత్యాన్ని బోధించారు. స్వేచ్ఛ కవిత్వంపై 46 పుస్తకాలు, పరిశోధన, సాహిత్య విమర్శలపై 14 పుస్తకాలు రచించారు. సుమారు 30 ఏళ్ల పాటు తెలుగు విభాగంలో ఆచార్యుడిగా పనిచేశారు. రంగారావు ఎప్పుడు తెల్లటి దుస్తుల్లో ఉన్నట్లే ఆయన కవితా సంపుటాలు కూడా తెల్లపురంగు కవర్ పేజీలపై ఎరుపు రంగు శీర్షికలతో ఉండేవి. మాదిరాజు రంగారావు మరణంపై సహృదయ సాహితీ సంస్థ అధ్యక్షుడు గిరిజా మనోహరబాబు, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్‌వీఎన్ చారి, కాళోజీ ఫౌండేషన్ మిత్ర మండలి సభ్యులు, ఫౌండేషన్ అధ్యక్షుడు నాగిళ్ల రామశాస్త్రి, కార్యదర్శి వీఆర్ విద్యార్థి సంతాపం ప్రకటించారు.



రంగారావు (ఫైల్)

ప్రణాళికతో చదివితే 'సివిల్స్' సాధ్యం

● ఆర్క్ రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ వివేకానంద

విద్యారణ్యపురి : ప్రణాళికతో చదివితే సివిల్స్ పరీక్షల్లో విజయం సాధ్యమని హైదరాబాద్‌లోని ఆర్క్ రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్, (యూపీఎస్‌సీ ర్యాంకర్–2014) డాక్టర్ జి.వివేకానంద సూచించారు. శనివారం హనుమకొండలోని హరిత కాకతీయలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులకు సివిల్స్ ఎలా క్లియర్ చేయాలి అనే అంశంపై నిర్వహించిన ఉచిత అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సివిల్ సర్వీస్ పరీక్ష సిద్ధం, లక్ష్య నిర్ధారణ, విజయానికి అవసరమైన మానసిక సంసిద్ధత వంటి అంశాలను వివరించారు. సివిల్ సర్వీసెస్ క్లియర్ చేయాలంటే రోజుకు 15 గంటలు చదవాల్సిన అవసరం లేదని, ఆరు నుంచి 8గంటలు చాలని తెలిపారు. ఐఐటీలు, పెద్ద యూనివర్సిటీల్లో చదివిన వారే యూపీఎస్‌సీ పరీక్షల్లో విజయం సాధిస్తారనేది అపోహ మాత్రమేనని సాధారణ కళాశాలల్లో డిగ్రీ కోర్సులు, ఇంజనీరింగ్ కోర్సులు చదివినవారు కూడా సరైన ప్రిపరేషన్‌తో సివిల్‌లో విజయం సాధించవచ్చన్నారు. వరంగల్ నుంచి పలువురు సివిల్స్‌లో విజయం సాధించగా వారి వివరాలను కూడా ఉదహరించారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో సివిల్స్ ప్రిపరేషన్‌కు విస్తృతంగా సమాచారం ఉందని ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్ కోచింగ్ తీసుకుంటే సివిల్‌లో విజయం సాధించవచ్చని పేర్కొన్నారు. ఇంటర్ విత్ ఐఏఎస్, డిగ్రీ విత్ ఐఏఎస్‌గా కోచింగ్‌లు కూడా ఇస్తున్నారన్నారు. ఆర్క్ రిఫ్లెక్షన్ ఐఏఎస్ అకాడమి అడ్మినిస్ట్రేషన్ హెడ్ బి. అవినాష్, వివిధ సంస్థల గ్రూప్ డైరెక్టర్లు గిరిప్రకాశ్, గణేష్ మాట్లాడారు. ఈ సదస్సులో వివిధ డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు, పేరెంట్స్ పాల్గొన్నారు. వారు అడిగిన సందేహాలను డైరెక్టర్ వివేకానంద నివృత్తి చేశారు.



సదస్సులో మాట్లాడుతున్న డైరెక్టర్ వివేకానంద

దోచుకుతిన్న ప్రతీ రూపాయి కక్కిస్తాం

● ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: పదేళ్ల అధికారంలో ఉండి బీఆర్‌ఎస్ నాయకులు దోచుకుతిన్న ప్రతీ రూపాయిని కక్కిస్తామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. డబ్బులు ఇవ్వకుంటే చంపుతానని బెరించిన కేసులో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేస్తే ఆందోళనలు చేయడంపై రాజేందర్‌రెడ్డి మండిపడ్డారు. హనుమకొండలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకులు ఒక్కొక్కరు రూ.వెయ్యి కోట్లకు తగ్గకుండా ప్రజల సొమ్ము దోచుకుతిన్నారని, మాకు ప్రజాస్వామ్యం, చట్టాలపై గౌరవం, నమ్మకం ఉంది కాబట్టే చట్టపరంగా అవినీతి సొమ్మును ప్రభుత్వం రాబడుతుందని చెప్పారు. చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి జై తెలంగాణ నినాదం ఎత్తడం సిగ్గుచేటన్నారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తూ కొందరు ప్రజల్లో తొందరగా పేరు తెచ్చుకోవాలని, హీరోగా చెలామణి కావడానికి ప్రయత్నిస్తున్నారని, అందుకు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ప్రత్యక్ష ఉదాహరణ అని అన్నారు. డబ్బులు ఇవ్వకుంటే చంపుతానని క్రషర్ యజమాని మనోజ్‌రెడ్డిని బెదిరించినట్లు పూర్తి ఆధారాలు ఉన్నాయన్నారు. సమావేశంలో వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాసరావు, మాజీ ఎంపీ పసునూరి దయాకర్, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, విజయశ్రీరజాలి, జక్కుల రవీందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వేదికపై ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ, దయాకర్

కేయూ ఎన్‌జీఓ అధ్యక్షుడిగా నవీన్‌కుమార్



ఎన్‌జీఓ ఎంప్లాయిస్ అసోసియేషన్ బాధ్యులకు ధ్రువీకరణ పత్రం ఇస్తున్న రాజేందర్

● క్లాస్‌ఫోర్త్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గుమ్మయ్య

కేయూ క్యాంపస్ : కేయూ ఎన్‌జీఓ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బి.నవీన్‌కుమార్ ఎన్నికయ్యారు. ఎన్‌జీఓ ఎంప్లాయిస్ అసోసియేషన్, క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఓటింగ్ శుక్రవారం జరుగగా ఓట్ల లెక్కింపు శనివారం యూనివర్సిటీలో నిర్వహించారు. అనంతరం ఫలితాలను రిటర్నింగ్ అధికారి ప్రొఫెసర్ కె.రాజేందర్ ప్రకటించారు. ఎన్‌జీఓ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బి.నవీన్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా మహ్మద్ యూనస్, జనరల్ సెక్రటరీగా వల్లాల తిరుపతి, జాయింట్ సెక్రటరీ (ఆర్గనైజింగ్)గా ఎ.సతీష్‌బాబు, జాయింట్ సెక్రటరీ(రిక్రియేషన్)గా టి.ప్రభాకర్, జాయింట్ సెక్రటరీ (మహిళా)గా బి.కృష్ణవేణి, ట్రెజరర్‌గా టి.దామోదర్ విజయం సాధించారు. అలాగే.. క్లాస్‌ఫోర్త్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పి.గుమ్మయ్య, ఉపాధ్యక్షుడిగా పి.అంకుష్, జనరల్ సెక్రటరీగా బొక్క మొగిలి, జాయింట్ సెక్రటరీగా ఆర్గనైజింగ్ మహ్మద్‌వలీ పాషా, జాయింట్ సెక్రట రీ(మహిళా)గా జి.మల్లికాంబ, జాయింట్ సెక్రటరీ (రిక్రియేషన్)గా ఎస్.ఐలయ్య, ట్రెజరర్‌గా టి.తిరుమల్ శ్రీనివాస్‌సింగ్ ఎన్నికయ్యారని రాజేందర్ తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ పంజాల శ్రీధర్, సహాయ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.



గెలుపొందిన క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ బాధ్యులు

పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

● బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు

హన్మకొండ : ఎలాంటి షరతులు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ సాధనకు, కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద బీసీ జేఏసీ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో తిరునహరి శేషు మాట్లాడుతూ..ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆంక్షలు పెట్టి బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీ విద్యార్థులకు అన్యాయం చేస్తే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామని హామీ ఇచ్చి అమలు చేయకుండా మోసం చేస్తోందని దుయ్యబట్టారు. బీసీ నాయకులు నూతనకంటి ఆనందం, పాలడుగు సురేందర్ మాట్లాడుతూ పూలే విదేశీ విద్యా జ్యోతి పథకం ద్వారా విదేశాలకు వెళ్లే బీసీ విద్యార్థుల సంఖ్యను 300 నుంచి 800కి పెంచే ప్రతిపాదన ఫైల్ వెంటనే సంతకం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు డాక్టర్ ఎర్రబొజ్జు రమేష్, చిన్నాల యశ్వంత్ యాదవ్, బండి డేనియల్, నేదునూరి రాజమౌళి, బుట్టి శ్యామ్ యాదవ్, దారా జనార్దన్, ఆకారపు మోహన్, కేడల ప్రసాద్, తాడిశెట్టి క్రాంతి, హైమావతి, బేబీ పాల్గొన్నారు.



సత్యాగ్రహ దీక్షలో మాట్లాడుతున్న తిరునహరి శేషు, దీక్షలో కూర్చున్న బీసీ నాయకులు

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

FLATS FOR SALE

3BHK, 1st ఫ్లోర్, 1478 sft (కొత్తది), E/F, అక్షర స్కూల్ ప్రక్కన, భవానినగర్ (డీజిల్‌కాలనీ), కాజీపేట - Hyd రోడ్‌కి అతిసమీపంలో మరియు వరంగల్ పబ్లిక్ స్కూల్‌కు అతిసమీపంలో KBR రెసిడెన్సి, 3BHK ఫ్లాట్స్ 1445 sft (పాతది) FLATS అమ్మబడును.
Cont: 9100777888

PLOT FOR SALE

■ 800 Sq. yards plot at Supriya Cold storage, Gorrekuntta, Warangal. 170 Sq. yards at Venkatadri nagar, Direct Party Kazipet. Ph: 93987 83805. [M 13605]

■ గుడ్ న్యూస్. జనగామ దగ్గర్లో వడిచెర్లలో ఫామ్‌ల్యాండ్ లాంచింగ్ ఆఫర్లో గII 1999/– & RRR HMDA లిమిట్స్ చీమల కొండూరులో తక్కువ రేటుకే. 6304914366 [SCA25005221]

SERVICES

■ కపిల్ చిట్స్‌లో బ్రొకెన్ చిట్స్ కలవు. ష్యూరిటీ పెట్టి, స్పాట్ క్యాష్ ఇప్పించబడును. ఆసక్తి గల వారు సంప్రదించండి. సెల్: 8790379618. [WA-6713]

BOOK STALL & XEROX SALE

■ An Reputed Book Stall & Xerox Shop for sale. Near Nayeemnagar, Opp: to Police Head Quarters, Hanamkonda. Cont: 8074797209. [WA-6714]

స్టార్ ఓల్డ్ ఏజ్ హోమ్ కేర్ సర్వీస్

■ స్టార్ ఓల్డ్ ఏజ్ హోమ్ / హోమ్‌కేర్ సర్వీస్ 24 గంII 12గంII వృద్ధులను, పెద్దవారిని, పేషంట్లను, చిన్న పిల్లలను చూసుకోవడానికి మీ ఇంటి వద్దకే అనుభవం గల వర్కర్లని స్త్రీ/పుIIలను పంపించగలము. సంప్రII 8977263124, 9100116067. [WA-6721]

BUSINESS OFFER

■ Need Monthly Returns? Get your Own International Capital Market Trading Account. Profit Sharing / Fixed Returns. Safe and Secure. Ph: 6301859174. [HA-SCA25005068]

WANTED

■ HYDలో ఇంట్లో ఉండి సీనియర్ సిటిజన్‌ను చూసుకుంటు ఇంటి/వంట పనిలో అనుభవం ఉన్న 50 సంIIలలోపు వయసున్న మగమనిషి కావలెను.వాట్సాప్‌కాల్ మాత్రమే.8019188715 [SCA25005228]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూII 260/- అదనపు లైను రూII 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లైయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.